లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు

జక్రాన్‌పల్లి, జనవరి 20 : మండలంలోని కొలిప్యాక్‌లో ఉన్న ఆనందగిరి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కుటుంబ సమేతంగా శనివారం పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఆలయంలో కోనేరు పునరుద్ధరణతోపాటు కొలిప్యాక్ –జాన్కంపేట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు అర్గుల్ చిన్నారెడ్డి, సర్పంచ్ గొర్త రాజేందర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మామిడి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేశ్, మాజీ సర్పంచ్ భూమన్న, అర్గుల్ ఎంపీటీసీ అనిత, మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్, జనవరి 20 : నగర శివారులోని నాగారంలో ఉన్న మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూర్యకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో చేరవచ్చని పేర్కొన్నారు. ఈ విదా సంవత్సరం నుంచి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్, లాసెట్ కోర్సులకు కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 98494 19469, 97000 41017 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బడాపహాడ్ ఉర్సుపై సమీక్ష

వర్ని, జనవరి 20 : మండలంలోని బడాపహాడ్‌లో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న ఉర్సు ఉత్సవాలపై బడాపహాడ్‌లో అధికారులతో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో దర్గా ప్రత్యేకాధికారి జమాల్, బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, వర్ని తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో బషీరుద్దీన్ పాల్గొన్నారు.

వార్షిక మహాసభల్లో డాక్టర్ విశాల్

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ విశాల్

ఖలీల్‌వాడి, జనవరి 20 : ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో శనివారం వార్షిక మహాసభను నిర్వహించారు. మహాసభకు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ ఆకులతోపాటు బృందం సభ్యులు డాక్టర్ అరవింద బ్రహ్మ, డాక్టర్ కిషన్, డాక్టర్ ఫణికాంత్ తెలంగాణ నుంచి పాల్గొన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌కు పాల్పడే వారి మానసిక విధానం, చికిత్సపై యువ వైద్యులకు వివరించారు. సభ నిర్వాహకులు డాక్టర్ విశాల్‌తోపాటు బృందాన్ని ప్రశంసాపత్రంతో సత్కరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్పల్లి, జనవరి 20 : ఇందల్వాయి మండలకేంద్రానికి చెందిన కుమ్మరి రాజేశ్ రోడ్డుప్రమాదంలో ఇటీవల మృతిచెందాడు. గల్ఫ్‌లో ఉండే రాజేశ్ స్నేహితులు రూ.61,500 పోగు చేసి బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు.

ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

■ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఓ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ధర్పల్లి/ మోస్రా (చందూర్)/ జనవరి 20 : ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సిబ్బందికి సూచించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్న ఉద్దేశంతో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, బీబీపూర్, ధర్పల్లి మండలంలోని రామడుగు పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు, జాబితా నుంచి పేర్ల తొలగింపు, మార్పులు–చేర్పుల కోసం చేపడుతున్న చర్యలు, అనుసరిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారిని గుర్తించి, ఓటరు జాబితాలో తప్పకుండా పేర్లు నమోదు చేయించాలని బీఎల్వోలకు సూచించారు. కార్యక్రమంపై ప్రచారం కల్పించి, అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను తొలగించే ముందు పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

మోస్రా మండల కేంద్రంలో నిర్వహించిన ఓటరు నమోదు ప్రక్రియను తహసీల్దార్ శ్రీకాంత్ రావు పరిశీలించారు. పలు పోలింగ్‌బూత్‌లను పరిశీలించి, బీఎల్‌వోలతో మాట్లాడి దరఖాస్తు వివరాలు తెలుసుకున్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

ముప్కాల్, జనవరి 20: ఓటుహక్కు లేని వారు బీఎల్‌వోలకు దరఖాస్తులు అందజేసి పేరు నమోదు చేయించుకోవాలని అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. మొండోరా మండలంలోని కోడిచెర్ల, సావెల్ గ్రామాల్లో శనివారం కొనసాగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని ముప్కాల్ డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీకాంత్ తెలిపారు.

రెంజల్ మండలంలో..

రెంజల్, జనవరి 20: మండలంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 40 మంది కొత్తగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ రాంచందర్ తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే పోలింగ్ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నజీమా సుల్తానా

చట్టాలపై అవగాహన

జక్రాన్‌పల్లి, జనవరి 20 : మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నజీమా సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదని, చట్టందృష్టిలో అందరూ సమానమేనని అన్నారు. గ్రామ బహిష్కరణ, అంటరానితనం ఉండకూడదన్నారు. పౌర హక్కులు, ఆన్‌లైన్ మోసాలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీ జైరాం, ఏసీపీ విజయసారథి, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్మూర్ బార్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీపీ కుంచాల విమలారాజు, తహసీల్దార్ ఖలీం, సీఐ సైదులు, ఎస్సై తిరుపతి, ఎంపీడీవో బ్రహ్మానందం, కో–ఆప్షన్ సభ్యుడు బుల్లెట్ అక్బర్‌ఖాన్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచ్ జక్కం చంద్రకళా బాలకిషన్, గొర్త రాజేందర్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు, విద్యార్థులు

సిరికొండ, జనవరి 20 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిరికొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి వినయ్‌నాయక్ అన్నారు. సత్యశోధక్ నేషనల్ గ్రీన్ కోర్ యూనిట్ ఆధ్వర్యంలో 'పర్యావరణం – పచ్చదనం అడవుల పరిరక్షణ'పై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. జీవకోటి మనుగడకు మొక్కల ప్రాధాన్యత, ప్రకృతిపై అవవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌జీసీ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించి, మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, డీఆర్వో గంగారాం, అటవీశాఖ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలను 8 నుంచి 9వ తరగతి వరకు అప్‌గ్రేడేషన్‌కు కృషి చేసిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతగా బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు శనివారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ వేముల ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు వీడీసీ వినతి మేరకు అప్‌గ్రేడేషన్ కోసం అధికారులతో మాట్లాడారన్నారు. తాజాగా అప్‌గ్రేడేషన్‌కు అనుమతి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుప్పాల గంగాధర్, సొసైటీ వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, వీడీసీ అధ్యక్షుడు మాలవత్ ప్రకాశ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంధం గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. – కమ్మర్‌పల్లి, జనవరి 20

రాములోరి దర్శనానికి స్పెషల్ రైళ్లు

పెద్దపల్లి, జనవరి 20 (నమస్తే తెలంగాణ): అయోధ్యలో శ్రీ రాముల వారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 22న జరుగనుండగా, రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ నెల 29 నుంచి వచ్చే మార్చి 3వ తేదీ వరకు అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు సికింద్రాబాద్, ఖాజీపేట, జాల్నా నుంచి ఆస్థా స్పెషల్ సర్వీసులు నడపాలని నిర్ణయించింది. జాల్నా నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు (వయా పర్భని–పూర్ణా–నాందేడ్–నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి–బల్లార్షా మీదుగా) రైలు నంబర్ (07649) ఫిబ్రవరి 4న నడుస్తుంది. ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరి బాసరకు మధ్యాహ్నం 3:15 గంటలకు, నిజామాబాద్‌కు సాయంత్రం 4కు, కోరుట్లకు 5:18కు, లింగంపేట్ జగిత్యాలకు 5:50కు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు 6:45కు, పెద్దపల్లి జంక్షన్‌కు 7:35కు, రామగుండానికి 8గంటలకు చేరుకొని 6న ఉదయం 3:35 గంటలకు అయోధ్య చేరుకోనున్నది. ఇక అయోధ్య ధాం జంక్షన్ నుంచి జాల్నా వరకు రైలు నంబర్ (07650) ఫిబ్రవరి 6న నడుస్తుంది. అక్కడ మధ్యాహ్నం 2:20 గంటలకు బయల్దేరి నిజామాబాద్ జంక్షన్‌కు రాత్రి 11:10కు, బాసరకు 11:53 గంటలకు, మరుసటి రోజు 6 గంటలకు జాల్నాకు చేరుకుంటుంది.

నత్తనడకన జాతీయ రహదారి పనులు

బోధన్ రూరల్, జనవరి 20: బోధన్ నుంచి సాలూరా మీదుగా ఆరు నెలల నుంచి జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయని బోధన్ ఎంపీపీ బుద్ధె సావిత్రీ రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ విషయమై జాతీయ రహదారుల అధికారులకు ఆమె శనివారం ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. పొలాల్లోకి వెళ్లేందుకు ర్యాంప్‌లు వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలాలను దమ్ము చేసేందుకు ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నియమాలు పాటించాలి

మాక్లూర్, జనవరి 20: రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గంగారాం అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 35వ ట్రాఫిక్ భద్రత మాసోత్సవాలను జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్‌కుమార్, ఏఎస్సై గంగాధర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్/బోధన్ రూరల్/ ధర్పల్లి/ కోటగిరి, జనవరి20: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని వెంకటాపూర్ లో శనివారం నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆవాస్‌యోజన, కిసాన్ సమ్మాన్‌నిధి, ఫసల్‌బీమా యోజన, గరీబ్ కల్యాణ్, చిరు వ్యాపారులకు ముద్రరుణాలు తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పథకాలతో కూడిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైక్రాంతి, సర్పంచ్ భవానీ, ఏవో పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీప్రియ, బ్యాంక్ అధికారులు, ఏపీఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బోధన్ మండలంలోని అమ్దాపూర్, ధర్పల్లి మండలంలోని మైలారంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొని మాట్లాడారు. కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్, ఎత్తొండలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం గ్రామస్తులకు బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై సూపర్‌వైజర్ సుమలత అవగాహన కల్పించారు. డీఏవో వాజిద్ హుస్సేన్, డీఎంహెచ్‌వో సుదర్శనం, సీడీసీ ధర్మానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా నియమించాలి'

ఆర్మూర్‌టౌన్, జనవరి20: మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నాను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించాలని కోరుతూ పట్టణంలోని కేనాల్ బ్రిడ్జ్ వద్ద ముస్లింలు శనివారం ధర్నా నిర్వహించారు. చైర్ పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గి 16 రోజులు పూర్తవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష

భీమ్‌గల్,జనవరి 20: నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష మండల కేంద్రంలోని రెండు సెంటర్లలో ప్రశాంతంగా కొనసాగింది. పరీక్షకు 336 విద్యార్థులకు గాను 242 మంది హాజరయ్యారని ఎంఈవో స్వామి తెలిపారు.

జీపీ కార్మికులకు ప్రమాద బీమా

కార్మికులకు ప్రమాదబీమా చేయిస్తున్న ఉపసర్పంచ్

కమ్మర్‌పల్లి, జనవరి 20: హాసాకొత్తూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామపంచాయతీ ద్వారా ప్రమాదబీమా పాలసీ చేయించారు. రూ.520 ప్రీమియం చెల్లించి రూ.10లక్షల పాలసీ బీమాను పోస్టాఫీసు ద్వారా చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్థిక సాయం

కమ్మర్‌పల్లి, జనవరి 20: బషీరాబాద్ జడ్పీహైస్కూల్‌లో డ్యూయల్ డెస్క్‌ల కోసం అదే గ్రామానికి చెందిన కోల నితిన్ తన తండ్రి జనార్దన్ స్మారకార్థం రూ.50వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. పాఠశాల కోసం గ్రామానికి చెందిన లక్మ సంతోష్ రూ.5వేలు, నేల శ్రీనివాస్ రూ.5 వేలు, పల్లె కిషన్ రూ.2,500 విరాళం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కనక గంగాధర్, ఎస్ఎంసీ చైర్మన్లు నీరడి సాయన్న, మారంపల్లి అశోక్, బైకన్ మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత ప్రతిభా పోటీలు

కమ్మర్‌పల్లి, జనవరి 20: స్థానిక జడ్పీహైస్కూల్‌లో మండల స్థాయిల గణిత ప్రతిభా పరీక్షను మండల గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. విజేతలకు ఎంఈవో ఆంధ్రయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల గణిత ఫోరం అధ్యక్షుడు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ముప్కాల్‌లో అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముప్కాల్, జనవరి 20: స్థానిక ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం గంగారాం శనివారం తెలిపారు. కాంపిటీషన్ థింకింగ్ అంశంలో మల్టీ టాస్కింగ్ రోబోట్ అనే ఉప అంశంపై జడ్పీహెచ్ఎస్ ముప్కాల్ పాఠశాల ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంత్, అభినయ్, మ్యాక ప్రణవ్ చైతన్య ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మంథనిలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్యామలబాయి, ఉపాధ్యాయులు

మంథని ఉన్నత పాఠశాల విద్యార్థులు..

ఆర్మూర్‌టౌన్, జనవరి20: మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం శ్యామలబాయి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల వర్చువల్‌గా నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో పాఠశాలకు చెందిన లాస్య, అంకిత రూపొందించిన సహజ పద్ధతిలో కూరగాయలు, పండ్లను నిలువ చేసే ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు సైన్స్ టీచర్ మల్లేశ్ గైడ్‌గా వ్యవహరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు, గైడ్ టీచర్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో అందించాలి

కోటగిరి, జనవరి 20 : మండలంలోని పలు రైస్‌మిల్లులను తహసీల్దార్ ప్రభాకర్, గిర్దావర్ సయ్యద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వానికి ఈనెల 31వ తేదీలోగా సీఎంఆర్ బియ్యాన్ని అందజేయాలని రైస్‌మిల్లుల నిర్వాహకులకు తహసీల్దార్ సూచించారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్

కోటగిరి, జనవరి 20 : పోతంగల్ మండల కేంద్రంలో పీఆర్టీయూ –పోతంగల్ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి మాథ్స్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూదం వెంకటేశ్, పోతంగల్ కాంప్లెక్స్ హెచ్ఎం సాయిలు, మండల నోడల్ అధికారి లోల శంకర్, కారేగాం హెడ్‌మాస్టర్ దుర్గారావు, పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు సత్యనారాయణ, నాగ్‌నాథ్, ఉదయ్, వెంకటేశ్వరరెడ్డి, శివకుమార్, శ్యాం, హన్మాండ్లు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారిణికి అభినందన

శ్రీనికను అభినందిస్తున్న జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల

కంఠేశ్వర్, జనవరి 20 : గుజరాత్‌లో ఇటీవల జరిగిన విలు విద్య పోటీల్లో ప్రతిభ కనబర్చిన జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి మద్దుల శ్రీనికను నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల శనివారం అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ఖేలో ఇండియా కోచ్ మద్దుల మురళి పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టాపల్లి విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్పల్లి, జనవరి 20 : డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు పురం మణితేజ, మెండె శ్రీతిక జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుశీల్‌కుమార్ తెలిపారు. వచ్చే నెల 3 నుంచి 6వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కబీర్ ధాంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు ఆర్మూర్‌లో నిర్వహించారు. 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 బాలబాలికల పోటీల్లో వీరు ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మార్కంటి గంగామోహన్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాఘవేందర్, బాల్‌రాజ్, పోశెట్టి, నిరంజన్, శ్రీధరాచార్యులు శనివారం అభినందించారు.

టీయూ తెలుగు విభాగాధిపతిగా లక్ష్మణ్ చక్రవర్తి

ధర్పల్లి, జనవరి 20 : టీయూ వీసీ బి.వెంకటేశం ఆదేశానుసారం రిజిస్ట్రార్ యాదగిరి.. తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ లక్ష్మణ్ చక్రవర్తిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ చక్రవర్తి వీసీతోపాటు రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ప్రమాదంలో ఎయిర్‌ఫోర్స్ అధికారి మృతి

రవిచంద్ర (ఫైల్)

మాక్లూర్, జనవరి 20 : చిక్లీ గ్రామ పంచాయతీలోని చిక్లీ క్యాంప్‌నకు చెందిన రవిచంద్ర (35) రైలు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. మృతుడు జమ్ముకశ్మీర్‌లో ఎయిర్‌ఫోర్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ఆంధ్రప్రదేశ్‌లోని తన అత్తగారింటికి వెళ్లాడు. శుక్రవారం భార్య శ్రీహర్ష, కూతుళ్లు జైస్వితత, సియాన్షను తీసుకుని వస్తున్నాడు. పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో కాలు జారి రైలు నుంచి పడి మృతి చెందాడు. ఆదివారం చిక్లీ క్యాంప్ స్వగ్రామంలో ఎయిర్‌ఫోర్స్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు.

సంక్షిప్తంగా..

- వేల్పూర్, జనవరి 20: వేల్పూర్ బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో విద్యార్థులు జై శ్రీరామ్ ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.
- మోర్తాడ్, జనవరి 20: మండల కేంద్రంలో శనివారం పేదలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ మోర్తాడ్ అధ్యక్షుడు మనోహర్, సర్పంచ్ పర్స దేవన్న, తీగెల రమేశ్, సంజీవ్, మోహన్, నాగరాజు, భూమా రెడ్డి, లింబాద్రి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.
- బాల్కొండ, జనవరి 20 : మండల కేంద్రంలో శనివారం శ్రమసేవలో భాగంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ గ్రామ యువకులు శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించామన్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో వీధులు శుభ్రం చేశామన్నారు.
- ముప్కాల్, జనవరి 20: మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించినట్లు పాఠశాల ఎస్‌వో వినోద తెలిపారు. ఎస్ఎంసీ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.
- బాల్కొండ, జనవరి 20: ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని పోలీసులు శనివారం స్థానిక జడ్పీహెచ్ఎస్ మైదానంలో వీక్లీపరేడ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి శనివారం పరేడ్‌ను నిర్వహిస్తున్నామని ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మండల ఎస్సైలు భాస్కరచారి, కె.గోపి, శ్రీనివాస్ యాదవ్, పోలీసులు పాల్గొన్నారు.
- రెంజల్, జనవరి 20: మండలంలోని జడ్పీ ఉన్నత, కేజీబీవీ, ఆదర్శ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈవో రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న జాబితాపై అభ్యంతరాలను స్వ